# రోడ్డును ఆక్రమిస్తున్నారంటూ ఆందోళన

**సనత్‌నగర్:** బేగంపేట బ్రాహ్మణవాడీ లేన్‌నెంబర్-8లో కొంతమంది రోడ్డును ఆక్రమించి ఫెన్సింగ్ పనులు చేపడుతున్నారని దీనిపై ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 40 ఏళ్లకు పైగా ఇక్కడే ఉంటున్నామని, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత 2014లో ఇక్కడ రోడ్డు నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేయడమే కాకుండా సీసీ రోడ్డు నిర్మాణం జరిపారన్నారు. ఇప్పుడు కొంతమంది పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో రోడ్డును కలుపుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారని, ఇందుకోసం ఇప్పటి వరకు ఉన్న ప్రహరీని పగుల గొట్టి మరీ రోడ్డును ఆక్రమించే క్రమంలో ఫెన్సింగ్ రాడ్లు కూడా పాతుతున్నారన్నారు. ఈ రోడ్డు గుండానే మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్లు కూడా ప్రభుత్వం వేసిందన్నారు. కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణానికి కూడా నిధులు మంజూరై పైపులు కూడా తెచ్చిపెట్టారని,



ఆందోళనకు దిగిన బేగంపేట బ్రాహ్మణవాడీ లేన్‌నెంబర్-8 నివాసితులు (సర్కిల్‌లో రోడ్డుకు మధ్యలో ఫెన్సింగ్ రాడ్లు)

ఉన్నట్టుండి ఇప్పుడు రోడ్డు తమ స్థలంలోకి వస్తుందంటూ కొంతమంది తెరమీదకు రావడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. విషయం తెలుసుకున్న పలువురు బీజేపీ నేతలు అక్కడకు చేరుకుని వీరికి మద్దతు తెలిపారు.

**ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం..**

ప్రైవేటు వ్యక్తులకు తమకు చెందిన స్థలానికి దిగువన నాలా రిటైనింగ్ వాల్‌ను ఆనుకుని ఉన్న రెండు వేల గజాలకు పైగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారంటూ బీజేపీ నేతలతో పాటు స్థానికులు ఆందోళన చేపట్టారు.




2013లో సేల్స్ డీడ్‌లో 8748 చదరపు గజాలు తమదిగా పేర్కొన్నారని, అదే 2024లో పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని తమదిగా నమ్మించి 9,680 చదరపు గజాలుగా తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించారని చెప్పారు. అంటే అదనంగా 932 గజాలను ఎక్కువగా చూపించారన్నారు. అదనంగా చూపించిన స్థలం ప్రభుత్వ స్థలమేనని స్థానికులు నొక్కి చెబుతున్నారు. ఆందోళనలో ఎయిర్‌లైన్స్ అపార్ట్‌మెంట్ 24 ఫ్లాట్స్ యజమానుల అసోసియేషన్ సెక్రటరీ మోహన్, భాస్కర్‌రావు, ఇతర ఫ్లాట్ల యజమానులు వెంకటేశ్వర రావు, రవీందర్‌రావు, హరీష్‌గౌడ్, దినేష్‌రావు, సురేష్‌తో పాటు నాయకులు శ్రీనివాస్‌ముదిరాజ్, విజయ్‌కుమార్, అంజిబాబు, రాజేందర్, శ్రీనివాస్, మునీర్‌ఖాన్ పాల్గొన్నారు.

## నేడు సంకటహర చతుర్థి

**సనత్‌నగర్:** సంకటహర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం గణపతి దేవాలయం ప్రాంగణంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృతాభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణ హారతి, తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయని ఈఓ శ్రీనివాసరాజు పేర్కొన్నారు.

## చింతబావిలో స్వల్ప అగ్నిప్రమాదం

**చిలకలగూడ:** చిలకలగూడ ఠాణా పరిధి చింతబావిలో స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. చిలకలగూడ రైల్వేక్వార్టర్స్ సమీపంలోని చింతబావి ప్రాంతంలోని చెట్ల పొదల్లో మంగళవారం సాయంత్రం 4 గంటలకు దట్టమైన పొగలతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రైల్వేక్వార్టర్స్‌లో నివసిస్తున్న వారు భయాందోళనకు గురై డయల్ 100కు సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. ఎండిన చెట్లపొదల్లో కాల్చిన సిగరెట్ లేదా నిప్పు పడటంతో ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు.

## ‘ఆరు గ్యారంటీ’లతో పేదలకు ప్రయోజనం



డిప్యూటీ మేయర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**లాలాపేట:** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలతో పేద, సామాన్య ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గృహజ్యోతి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ 500 కే వంట గ్యాస్ పథకాలను మంగళవారం ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, ఆమె భర్త మోతే శోభన్‌రెడ్డిని మంగళవారం మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. పార్టీలో చేరడంపై హర్షం వ్యక్తం చేస్తూ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలకుంట లింగయ్య, లాజరస్, శ్రీనివాస్, నర్సింహా, వెంకట్, వరికుప్పల రవి, ముత్తయ్య పాల్గొన్నారు.

## సనత్‌నగర్ ఈఎస్ఐకి ఉత్తమ సేవ అవార్డు

**అమీర్‌పేట:** సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న ఉత్తమ సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం అవార్డుతో సత్కరించింది. ఈఎస్ఐసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ప్రతి ఏటా ఉత్తమ సేవా విభాగంలో ప్రథమ, ద్వితీయ అవార్డులను అందజేస్తుంది.73వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా ఉన్న 10 ఈఎస్ఐసీ ఆసుపత్రుల ద్వారా రోగులకు అందుతున్న మెరుగైన వైద్య సేవలు,ఆసుపత్రుల నిర్వహణ వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుంటారు.ఈ సంవత్సరానికి సనత్‌నగర్ ఆసుపత్రి ద్వితీయ స్థానంలో నిలువగా ఫిబ్రవరి 24న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర కార్మిక శాఖ మంత్రి భూపేందర్‌యాదవ్ చేతుల మీదుగా షీల్డ్‌ను వైద్య కళాశాల డీన్ డాక్టర్ మాధురి శ్రీష్ కాటే అందుకున్నారు. మంగళవారం ఆసుపత్రిలో జరిగిన ఓ కార్యక్రమంలో డీన్ మాధురి మాట్లాడుతూ.. మెడికల్ కళాశాల, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్వహణకు సంబంధించి పాటిస్తున్న అత్యుత్తమ ప్రమాణాలతో పాటు వైద్యులు, సిబ్బంది సమష్టి కృషి ఫలితంగా అవార్డు దక్కిందన్నారు.

## నేడు ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.గణేష్ ఉద్యోగ విరమణ



ప్రొ.గణేష్

**ఉస్మానియా యూనివర్సిటీ:** ‘సివిల్స్ కోచింగ్ గణేష్ సార్’గా పేరుగాంచిన ఓయూ సోషియాలజీ అధ్యాపకులు, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.చింత గణేష్ నేడు (28న) ఉద్యోగ విరమణ చేయనున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రొ.గణేష్ డిగ్రీ అనంతరం 1984లో ఓయూ ఆర్ట్స్ కాలేజీలో సోషియాలజీ విభాగంలో ఎంఏ కోర్సులో చేరారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన పీజీ అనంతరం ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తిచేసి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరి 34 ఏళ్లుగా బోధన, పరిశోధనలతో పాటు ఓయూలో వివిధ పదవులను చేపట్టారు. గతేడాది వర్సిటీల ఉత్తమ అధ్యాపకుడిగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డు అందుకున్న ప్రొ.గణేష్ 11 సదస్సులను స్వయంగా నిర్వహించి 60 జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు హాజరయ్యారు. నాలుగు పుస్తకాలను రచించిన ఆయన పర్యవేక్షణలో 25 మంది విద్యార్థులు పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టాలను అందుకున్నారు. మూడు రిసర్చ్ ప్రాజెక్టులు, నలుగురు పోస్టు డాక్టరల్ (పీడీఎఫ్) స్కాలర్లు పరిశోధనలకు మార్గదర్శకత్వం వహించారు.

## పేదలకు చేయూత ఇవ్వడమే కేసీఆర్ ఉద్దేశం



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని



రాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

**సనత్‌నగర్:** పేద, మధ్యతరగతి ప్రజలకు చేయూతను అందించాలనే ఉద్దేశంతోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలను ప్రారంభించారని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. 37 మందికి మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను మంగళవారం ఆయన వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరి, మాజీ కార్పొరేటర్లు ఎన్.శేషుకుమారి, అరుణగౌడ్, ఆకుల రూప పాల్గొన్నారు.

**పరామర్శ..**

**బన్సీలాల్‌పేట్:** బన్సీలాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వెంకటేశన్(రాజు) అస్వస్థతకు గురయ్యారు. అనారోగ్యంతో కిమ్స్ ఆసుపత్రిలో చేరిన రాజును మంగళవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. మెరుగైన వైద్య ఆరోగ్య సేవలను అందించాలని డాక్టర్లకు సూచించారు.

**నివాళి**

**అమీర్‌పేట:** బీఆర్ఎస్ నేత గోదాస్ కిరణ్ తండ్రి యాదగిరి అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తలసాని మంగళవారం బీకేగూడలోని నివాసానికి చేరుకుని పార్థివదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ఐఏడీవీఎల్ సెక్రటరీ జనరల్‌గా భూమేష్‌కుమార్



**గాంధీఆస్పత్రి :** ఇండియన్ అసోషియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్, వెనిరాలజిస్ట్, లెప్రాలజిస్ట్ (ఐఏడీవీఎల్) హనరరీ సెక్రటరీ జనరల్‌గా సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ పిడియాట్రిక్ డెర్మటాలజీ విభాగ వైద్యుడు కటకం భూమేష్ కుమార్ నియమితులయ్యారు.నగరంలో ఇటీవల జరిగిన డెర్మకాన్-2024 సదస్సులో ఆయన హనరరీ సెక్రటరీ జనరల్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. భూమేష్‌కుమార్ గతంలో పలు పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. 52 ఏళ్ల ఐఏడీవీఎల్ చరిత్రలో తెలంగాణకు చెందిన వైద్యుడు సెక్రటరీ జనరల్ ఎన్నిక కావడం ఇదే ప్రథమం. తనకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు.

## ఆటపాటలతో చిన్నారుల సందడి




**రాంగోపాల్‌పేట్:** అందమైన డ్రెస్సులు, అదిరేటి స్టెప్పులు, వావ్ అనిపించే డ్యాన్సులతో అదరగొట్టారు సంజన ప్లే స్కూల్ కిండర్ గార్డెన్ చిన్నారులు. మంగళవారం సాయంత్రం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్ ఈ ప్లే స్కూల్ మారుతీ వీధి, అల్వాల్ శాఖల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుడిబుడి నడకలతో వేస్తే స్టెప్పులు చూస్తూ తల్లిదండ్రులు, ప్రేక్షకులను మైమరిపించారు. ఆటాపాటలతో పాటు ఆధ్యాత్మిక నాటికలు అద్భుతంగా ప్రదర్శించి అందరిని ఆకర్షించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ శారద మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఉండే ప్రతిభాపాటవాలను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా సంక్రాంతి సంబురాల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులకు బహుమతులు, వివిధ అంశాలను ప్రదర్శించిన చిన్నారులకు ట్రోఫీలను అందించారు.

## శ్రీహరికోట విహారయాత్రకు అనాథపిల్లలు



**పద్మారావునగర్:** బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్‌లోని ఆశ్రిత స్వచ్ఛంద సంస్థలోని అనాథ పిల్లలను అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్, పీపుల్ హెల్పింగ్ చిల్డ్రన్ సంస్థల సహకారంతో 50 మంది విద్యార్థులు ఐదుగురు సిబ్బందిని శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రానికి విహారయాత్రకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు మాట్లాడుతూ.. విజ్ఞాన విహారయాత్రలు పిల్లల విద్యా వికాసానికి, వారిలోని సృజనాత్మకతను వెలికితీయడానికి ఎంతో దోహదపడుతాయన్నారు. విద్యాభివృద్ధి ద్వారానే పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగు చూడగలమన్నారు. భారతదేశపు ఇస్రో సంస్థ చేపడుతున్న అంతరిక్ష కార్యక్రమాలు, విజ్ఞాన పరమైన అంశాల గురించి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి నాగరాజు, వెంకటేశ్వర్లు, శేఖర్, హరీష్, చంద్ర, రాజు పాల్గొన్నారు.

## భవనంపైకి ఎక్కి వ్యక్తి హల్‌చల్




భవనంపై విఠల్

**చిలకలగూడ :** మద్యం మత్తులో నాలుగు అంతస్తుల భవనంపైకి ఎక్కి కిందికి దూకుతానంటూ ఓ వ్యక్తి హల్‌చల్ చేసిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆదిలాబాద్‌కు చెందిన విఠల్ కల్తీకల్లుకు బానిసయ్యాడు. కుమారుడు ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పలు రుగ్మతలతో బాధపడుతున్న విఠల్ వైద్య చికిత్స కోసం మంగళవారం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి వచ్చాడు. అప్పటికే పూటుగా కల్లు తాగిన విఠల్ ఆస్పత్రి వెనుకవైపున్న పద్మారావునగర్ అభినవ్‌నగర్‌కాలనీకి చేరుకున్నాడు. వైద్య విద్యార్థులకు కోచింగ్ ఇస్తున్న ఓ సంస్థ భవనం నాలుగో అంతస్తు టెర్రస్‌పై కెక్కి గట్టిగా కేకలు వేశాడు. గమనించిన స్థానికులు, సంస్థ ప్రతినిధులు విఠల్‌ను కిందికి దించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చాకచక్యంగా వ్యవహరించి భవనంపై నుంచి సురక్షితంగా కిందికి దించి అదుపులోకి తీసుకున్నారు. స్వల్పంగా గాయపడిన విఠల్‌ను వైద్యసేవలు అందించి ఆదిలాబాద్‌లోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

## ఉన్నత విద్య ప్రమాణాలు పెంపొందించాలి

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలు పెంపొందించాలని న్యాక్ మాజీ డైరెక్టర్ ప్రొ.వీఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో ఓయూ న్యాక్ గుర్తింపుపై రెండు రోజుల జాతీయ సదస్సు జరిగింది. కార్యక్రమానికి వీసీ ప్రొ.రవీందర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ప్రొ.వీఎస్ ప్రసాద్, గౌరవ అతిథిగా రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.లింబాద్రి పాల్గొని మాట్లాడారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**రసూల్‌పురా:** మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సికింద్రాబాద్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.రవికుమార్ సూచించారు. మంగళవారం కళాశాలలో నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యువతే లక్ష్యంగా కొందరు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు మాదక ద్రవ్యాలను అలవాటు చేస్తున్నారని ఒక్కసారి వాటికి అలవాటు పడితే జీవితం మొత్తం సర్వనాశనం అవతుందన్నారు. తమ పిల్లల్లో వస్తున్న మార్పులపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనిస్తుండాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మృదుల లక్కరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాజేందర్, సంధ్యా, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సూర్య పాల్గొన్నారు.

## ఉచిత విద్య హక్కు చట్టం అమలు చేయాలి

**అడ్డగుట్ట:** ఉచిత విద్యా హక్కుల చట్టం అమలు చేసేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీహాల్లో బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా పలువురు మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని, సరిపడా మౌలిక వసతులు కూడా లేవన్నారు. అంతే కాక సరిపడ ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠాలు అర్థం కావడం లేదన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ జరగడం లేదని బస్తీల్లో పిల్లలు మద్యం, మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని, వాటిని నియంత్రించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ ప్రవీణ్, జిల్లా కార్యదర్శి సీహెచ్. లక్ష్మీనారాయణ, మద్యం, మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ అడ్వైజర్ అజయ్‌బాబు, ఆర్. మల్లేష్, సమ్మయ్య, నర్సింగ్‌రావు, రామలీల, కాంపల్లి శ్రీనివాస్, గోపి, సాయిబాబా, హరి, కరుణాకర్, సువర్ణ, భాగ్య, క్రాంతిరేఖ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు

## నేటితో ముగియనున్న ప్రతిష్ఠాపన మహోత్సవం

**అడ్డగుట్ట:** డివిజన్‌లోని సీ-సెక్షన్ మార్కండేయ దేవాలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు బుధవారంతో ముగియనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. మార్కండేయ సహిత శివ పంచాయతన, శిఖర, ధ్వజస్తంభ, యంత్ర స్థాపన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు బుధవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత సేవ, గురు ప్రార్థన, గణపతి పూజ, న్యాసప్రకరణల అనంతరం, 11.30 గంటల నుంచి దృష్టి స్థాపనతో, కుంభార్చన, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం చివరగా శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా కేంద్రమంతి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగ్ల స్వామి, కత్తుల సుదర్శన్ హాజరుకానున్నట్లు తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు

## సమన్వయంతో పని చేయాలి

**బౌద్ధనగర్:** అధికారులు సమన్వయంతో పని చేస్తే సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని కార్పొరేటర్ కంది శైలజ సూచించారు. బౌద్ధనగర్‌లోని బాటీ బేకరీ సమీపంలో కలుషి త నీటి సరఫరాతో ప్రజలు ఇబ్బంది లు పడుతున్నారని సమాచారం అందుకున్న కార్పొరేటర్ జలమండలి అధికారులతో కలిసి అక్కడికి వెళ్లారు. సమస్య ను పరిష్కరించాలంటే పైప్‌లైన్ పక్కనే ఉన్న ఎలక్ట్రికల్ పోల్ తొలగించాల్సిన అవసరం ఉందని అధికారులు తెలిపారు. దీంతో వెంటనే విద్యుత్ సంబంధిత అధికారులతో మాట్లాడి పోల్‌ను తొలగించే విధంగా చూడాలని కార్పొరేటర్ ఆదేశించారు. జలమండలి, విద్యుత్ అధికారులు సమన్వయంతో పని చేసి సమస్యను పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం కృష్ణ, ఏఈ ప్రియాంక, ఏఈ శ్రీకాంత్ ఉన్నారు.

## ‘కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం’

**సికింద్రాబాద్:** కేంద్రలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బిజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. విజయ సంకల్ప యాత్ర విజయవంతం కోసం సికింద్రాబాద్‌లో మంగళవారం నిర్వహించిన బీజేపీ నేతల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడారు. కాంగ్రెస్ ఇక్కడ అధికారంలో ఉన్నప్పటికీ కేంద్రంలో అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని, రాష్ట్రహితం కోరే బీజేపీకే ఓటు వేయాల్సిన అవసరాన్ని ఈ యాత్ర ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు వివరించారు. బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని, ఓటు వేసినా లాభం లేదన్నారు. ఆ పార్టీ రద్దయిన రెండు వేల నోటుతో సమానమని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సుందర్‌గౌడ్, మేకల సారంగపాణి, రవిప్రసాద్‌గౌడ్, రాచమల్ల కృష్ణమూర్తి, నాగేశ్వర్‌రెడ్డి, ప్రభుగుప్త, హరి, రామువర్మ, రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

## విద్యావంతులు, యువత రాజకీయాల్లోకి రావాలి



వేణుగోపాల్ స్వామి

**సికింద్రాబాద్:** యువత రాజకీయాల్లోకి రావాలని, దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని కాంగ్రెస్ నాయకులు సీఏ. వేణుగోపాల్ స్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశ జనాభాలో యువకుల శాతమే అధికంగా ఉందని యువత ప్రగతిపథంలో దూసుకెళ్తే దేశం అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలుస్తుందనారు. యువతతోనే రాజకీయాల్లో మార్పు సాధ్యమని సామాన్య యువకులు సైతం పార్లమెంట్‌లో అడుగు పెట్టాలని, దేశ, జాతి భవిష్యత్ యువతపైనే ఉందన్నారు. పాలన, రాజకీయపరమైన నిర్ణయాల్లో యువత పాత్ర తప్పక ఉండాలని, ప్రభుత్వం ఏం చేస్తుందో పట్టించుకోవాల్సిన అవసరం వారిపై ఉందన్నారు.

## హైదరాబాద్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

**సికింద్రాబాద్:** ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల హైదరాబాద్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం సీతాఫల్‌మండిలోని బీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగాబొర్ర భిక్షపతి మాట్లాడుతూ.. ఈ నెల 29న అంబర్‌పేట్ నియోజకవర్గంలోని రాణా ప్రతాప్ గార్డెన్స్‌లో నిర్వహించనున్న హైదరాబాద్ జిల్లా సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్, మంథని శామ్యూల్, ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు తుమ్మల శివప్రసాద్, భూపతి సుజాత, డప్పు మల్లికార్జున్, సురారం సుజాత, వేణుగోపాల్, రాజు, మహేష్, రాజేష్, సీతారం, కుమార్, కొప్పుల సాయి, బండ్ల గణేష్, విజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొర్ర భిక్షపతి మాదిగ

## తెలుగు భాష పరిరక్షణకు ముందుకు రావాలి

**ఉస్మానియా యూనివర్సిటీ:** తెలుగు భాష పరిరక్షణకు పౌరులు ముందుకు రావాలని డా.నందిని సిధారెడ్డి పేర్కొన్నారు మంగళవారం జరిగిన ఓయూ తెలుగు విభాగం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో తెలుగు భాషలో చదివిన విద్యార్థులకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. తెలుగును ఆధునిక అవసరాలకు అనుకూలంగా మార్చితేనే ఉద్యోగ అవకాశాలు ఉంటాయని విశ్రాంత అధ్యాపకులు ప్రొ.కసిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుత విద్యార్థులతో పాటు భావితరాలు తెలుగు మాట్లాడకుంటే భాష కనుమరుగవుతుందని తెలుగు వర్సిటీ మాజీ వీసీ ఎస్వీ సత్యనారాయణ అన్నారు. గౌరీశంకర్, డా.వేణుగోపాల్, ప్రొ.అండమ్మ, ప్రొ.సూర్యధనుంజయ్, పూర్వవిద్యార్థుల సంఘం కార్యదర్శి ప్రొ.కాశీం పాల్గొని ప్రసంగించారు.



కార్యక్రమంలో పాల్గొన పూర్వవిద్యార్థులు

## తహసీల్దార్ కార్యాలయం మార్పునకు వినతి

**అడ్డగుట్ట:** అడ్డగుట్టలోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న మారేడుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని వేరే చోటుకు మార్చాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా బాల కార్మిక వ్యవస్థకు తాము కృషి చేస్తున్నామని, ప్రతీ ఏడాది బడి బయట పిల్లలను బడుల్లో చేర్పిస్తున్నామన్నారు. అడ్డగుట్టలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 300 మంది, ఉన్నత పాఠశాలలో 500 మంది విద్యార్థులు చదువుతున్నారని వీరికి సరిపడ తరగతి గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకే పాఠశాల భవనంలో కొనసాగుతున్న మారేడుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని వేరే చోటుకు మార్చేలా చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు.

## డయాలసిస్ రోగికి మూత్రపిండం అమరిక

**అమీర్‌పేట:** జీవన్‌దాన్ కార్యక్రమంలో భాగంగా డయాలసిస్ రోగికి సనత్‌నగర్ ఈఎస్ఐ వైద్యులు మొట్టమొదటి సారిగా మూత్రపిండాన్ని అమర్చారు. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యులు వివరాలను వెల్లడించారు. ఈఎస్ఐ కార్డు లబ్ధిదారుడైన శ్రీ రాజ్‌కుమార్ కిడ్నీలు పాడవడంతో గత నాలుగేళ్లుగా డయాలసిస్‌పై జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 21న ఉస్మానియా ఆసుపత్రిలో ఓ వ్యక్తి బ్రెయిన్‌డెడ్ కాగా సదరు వ్యక్తికి సంబంధించిన ఓ మూత్రపిండాన్ని ఈఎస్ఐసీ ఆసుపత్రికి కేటాయిస్తూ జీవన్‌దాన్ సంస్థ నిర్ణయం తీసుకుంది. వెంటనే నెఫ్రాలజీ విభాగం వైద్య నిపుణులు డాక్టర్ కార్తీక్, న్యూరాలజీ విభాగం వైద్యులు సందీప్ బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి రాత్రి 11 గంటల సమయంలో మూత్రపిండాన్ని సేకరించారు. సురక్షితమైన పద్ధతిలో ప్రత్యేక వాహనంలో తెల్లవారుజామున 4 గంటల ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వైద్యులు జగదీశ్వర్, పాండురంగారవు, ధనలక్ష్మి శ్రీ రాజ్‌కుమార్‌ను శస్త్ర చికిత్సకు అంతా సిద్ధం చేసి ఉంచడంతో మూత్రపిండాన్ని అమర్చారు.ఇదిలా ఉండగా ఈఎస్ఐ చరిత్రలో మొట్టమొదట మూత్రపిండ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం చేసినట్లు తెలిపారు. మార్పిడి అనంతరం రోగి క్రమంగా కోలుకుంటున్నారని, క్రియాటిన్ కూడా అదుపులోకి వస్తుండటంతో మూత్ర విసర్జన పూర్వ స్థితికి చేరుకుందని జగదీశ్వర్ తెలిపారు.ఈ శస్త్ర చికిత్సను విజయవంతం చేయడంలో సహకరించిన వైద్య బృందం, సిబ్బందితో పాటు ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగేందర్, జీవన్‌దాన్ (నిమ్స్)రాష్ట్ర ఇన్‌చార్జ్ స్వర్ణలతకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



శస్త్రచికిత్సలో పాల్గొన్న ఈఎస్ఐ వైద్య బృందం

## వాకింగ్‌కు వెళ్లిన వ్యక్తి అదృశ్యం



ఏఎన్ కిషోర్

**చిలకలగూడ :** వాకింగ్‌కు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సబిత వివరాల ప్రకారం..సీతాఫల్‌మండి బీదలబస్తీకి చెందిన ఏఎన్ కిషోర్ (53) దిల్‌సుఖ్‌నగర్‌లోని ఎస్‌వీ ఇన్‌ఫోటెక్ సంస్థలో పని చేస్తున్నాడు. ఈ నెల 26న ఉదయం వాకింగ్‌కు అనిచెప్పి బయటకు వెళ్లి ఎంతకీ ఇంటికి రాలేదు. పరిసర ప్రాంతాల్లో గాలించి, సన్నిహితులు, బంధుమిత్రులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో భార్య సంతోషికుమారి మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. కిషోర్ గత కొంతకాలంగా ఆస్తమా రుగ్మతతో బాధపడుతున్నాడని, మందులు, సెల్‌ఫోన్ ఇంట్లో ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొంది.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

**రసూల్‌పురా:** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి క్షేమంగా తమ గమ్య స్థానాలకు చేరుకోవాలని తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్. మధుబాబు సూచించారు. మంగళవారం తిరుమలగిరి టీచర్స్ కాలనీలో ట్రాఫిక్ నిబంధనలపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ వాహనదారులకు అవగాహన కల్పించారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వొద్దని ఏదైనా ప్రమాదం జరిగితే తల్లిదండ్రులపై కూడా కేసు నమోదవుతుందన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేస్తామన్నారు. విద్యార్థులు జీబ్రా క్రాసింగ్ వద్దే రోడ్డు దాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది రమేష్, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.